క్లుప్తంగా

నేడు సీపీయం మహా సభ



మాట్లాడుతున్న మండల కార్యదర్శి భైరవప్రసాద్

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో మంగళవారం సీపీఎం మహాసభ నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి భైరవప్రసాద్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భైరవ ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ మహా సభలు మూడేళ్లకోసారి జరుగుతాయన్నారు. డిసెంబర్ 14, 15వ తేదీల్లో జిల్లా మహాసభలు కడపలో జరుగుతాయరు. ఈ సమావేశంలో గౌసియాబేగం, వరలక్ష్మి, చిన్నయ్య, గురయ్య, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చాపాడు : మండల పరిధిలోని సోమాపురం గ్రామంలో ఓ వెంకటస్వామి, ఎం. పెద్ద వెంకట సుబ్బయ్య అనే రైతుల ఫిర్యాదు మేరకు పంట రకం నిర్ధారణ చేసేందుకు బుధవారం ఊటూకూరు వ్యవసాయ క్షేత్రం ప్రధాన శాస్త్రవేత్త డా.జి.ప్రభాకర్‌రెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా.వీరయ్య, ఏఆర్ఎస్ డా.పి.శ్రీవల్లి పంటను పరిశీలించారు. బాధిత రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో బీపీటీ 5,204 రకం వరి పంటను సాగు చేసుకున్నారు. పంట కాలం పంట రకం మారడంతో బాధిత రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఊటూకూరు వ్యవసాయ క్షేత్ర శాస్త్రవేత్తలు పంటను పరిశీలించారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు



ఆర్డీఓ చంద్రమోహన్‌కు సమస్యలను వివరిస్తున్న ఆలయ నిర్వాహకులు

కాశినాయన : కాశినాయన ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. జ్యోతిలోని కాశిరెడ్డినాయన సమాధిని బుధవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలలతో ఆయనను సత్కరించారు. అనంతరం ఆర్డీవో ఆలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రిజర్వు ఫారెస్టులో ఉన్నందున దేవాలయ నిర్మాణాన్ని ఆపివేశారని ఆలయ నిర్వాహకులు ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, డీటీ రవిశంకర్, ఆర్ఐ అమర్‌నాథ్ రెడ్డి, స్థానిక వీఆర్ఓ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పంటలకు బీమా చెల్లించాలి



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

చాపాడు : రబీలో సాగు చేసుకున్న పంటకు ప్రధాన మంత్రి ఫసల్ యోజనా పథకం క్రింద పంట బీమా ప్రీమియాన్ని డిసెంబర్ 15వ తేది లోగా చెల్లించుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ అన్నారు. మండలంలోని అనంతపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు పంటల సాగుపై మెళకువలు, సూచనలు చేశారు. మీ సేవ కేంద్రాలు, సీఎస్‌సీ సెంటర్లలో బీమా ప్రీమియం చెల్లించవచ్చని ఏఓ సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన దోమల నివారణ కార్యక్రమాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యవేక్షించారు. మున్సిపాలిటీలోని దొరసానిపల్లె మురికి కాలువలో దోమల నివారణకు అబిడ్ ద్రావణం స్ప్రే, ఎంఎల్ ఆయిల్ మున్సిపల్ సిబ్బంది వేశారు. మేదర వీధిలో ఉన్న చెత్త పాయింట్‌ను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.గోవిందరెడ్డి, వి.సుబ్బారాయుడు, ఎస్.నూర్‌బాషా, మేస్త్రి ఐజయ్య పాల్గొన్నారు.

నేడు సైకతలింగ పూజలు

కడప కల్చరల్ : ప్రముఖ క్షేత్రమైన పుష్పగిరిలో ఈనెల 28న సైకతలింగ పూజలు నిర్వహించనున్నట్లు శ్రీ పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షులు సట్టి భారవి తెలిపారు. పెన్నా నది తీరం వద్ద మాస శివరాత్రిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా సీసీ రోడ్ల నిర్మాణం

- ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు



వంకలో సిమెంటు రోడ్డు వేసేందుకు చదును చేసిన ప్రాంతం

కలసపాడు : కలసపాడు మండలంలో సిమెంటు రోడ్ల నిర్మాణం అధికారుల నిర్లక్ష్యం వలన అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. మండలంలోని 13 పంచాయతీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 30 పనులకు రూ.1.80 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. నిబంధనల ప్రకారం పనులు చేపట్టాల్సిన మండల ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను ఇష్టారాజ్యాంగా చేస్తున్నారు. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది. మండల పరిధిలోని ఎగువ రామాపురం పంచాయతీలో మూడు సిమెంటు రోడ్ల పనులకు ప్రభుత్వం రూ.18 లక్షలు మంజూరయ్యాయి. ప్రజలకు అవసరమైన చోట్ల నిర్మించాల్సిన రోడ్ల పనులు పనులు దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ అడ్డగోలుగా పనులు చేసేందుకు రోడ్లను చదును చేస్తున్నారు. మూలపల్లె చిన్నమాబు ఇంటి నుంచి సమీపంలోని వంకలో సిమెంటు రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అంతేకాకుండా దర్గా నుంచి రెడ్డి పల్లెదస్తగిరి ఇంటి వరకు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పనులు చేస్తున్నారు.

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యాం

అలాగే పలుచోట్ల అవసరం లేకుండా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యాంగా రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వంకలో రోడ్డు వేసేందుకు చదును చేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెండ్లిమర్రి గ్రామంలో ఏబీఐ నిధులతో గత ప్రభుత్వం రూ.60 లక్షలకు పైగా నిధులు మంజూరు చేసి కంకర మిక్స్ పరిచి చదును చేశారు. ఆ పనులు అసంపూర్తిగా ఉండగానే ఎన్ఆర్‌జీఎస్ నిధుల ద్వారా ఓ వ్యక్తి ప్రయోజనం కోసం రూ.5 లక్షలతో రోడ్డు వేశారు. దీని వలన గత ప్రభుత్వం కేటాయించిన రోడ్డు పని అసంపూర్తిగా ఉండగానే నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పనులు చేశారు. మండలంలో పలుచోట్ల జరుగుతున్న పనులు నాసిరకంగా జరగడమే కాకుండా నీటి క్యూరింగ్ కూడా లేకుండా పోయింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా, నాసిరకంగా జరుగుతున్న జాతీయ గ్రామీణ హామీ పథకం రోడ్లపై తగిన పర్యవేక్షణ కొనసాగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పేదలకు అన్యాయం జరిగితే ఉద్యమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న వీరశేఖర్

బద్వేలు అర్బన్ : పేదల పక్షాన నిలవాల్సిన అధికారులు వారికి అన్యాయం చేస్తే ఉద్యమిస్తామని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దళితుల భూములు పెద్దల చేతుల్లో ఉన్నాయని, వాటిని లబ్ధిదారులకు అప్పచెప్పాలని కోరారు. ఖాళీ స్థలాలను వెతికి పెద్దలకు కట్టపెట్టే పనిలో ఉండడం తగదన్నారు. ఇళ్ళు లేని నిరుపేదలు రెండు సెంట్ల స్థలంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తుంటే చట్టాలను ఉపయోగించి వారికి నీడ లేకుండా చేసే ఆలోచన మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పిడుగుమస్తాన్, ఇమ్మానుయేల్, పి.వెంకటరమణ, జి.పెంచలయ్య, సి.ప్రసాద్, రమణ, నరసింహులు, ప్రభాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కలసపాడు : వెలుగు ఏపీఎంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కలసపాడులో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ వెలుగు కార్యాలయానికి నెలకు రెండు, మూడు సార్లు వస్తూ ఏపీఎం కాలం గడుపుతున్నారని, కింది స్థాయి సిబ్బందితో పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోతే వెలుగు కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సుదర్శన్, ఆవాజ్ మండల కార్యదర్శి చిన్ననాగూర్‌వలి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



కూరగాయల మార్కెట్‌లో వ్యాపారస్తులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులోని కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి సూచించారు. కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన ఆయన వ్యాపారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వ్యాపారులకు కేటాయించిన ప్లాట్‌ఫామ్ కంటే ముందుకు తాత్కాలిక నిర్మాణాలు ఏర్పాటు చేయడం ప్రజలకు అసౌకర్యంగా ఉందని, తక్షణమే తొలగించుకోవాలని సూచించారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి

మున్సిపాలిటీ పరిధిలోని బృహత్తర తాగునీటి పథకానికి సంబంధించిన వాటర్ ట్యాంకు పరిసరాలలో పిచ్చి మొక్కలు తొలగించాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. మార్తోమా నగర్ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించిన ఆయన డిసెంబర్ 1వతేదీ నుంచి రోజు మార్చి రోజు నీటిని సరఫరా చేస్తామని, గతంలో ఉన్న ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. ట్యాంకుల ఆవరణలో కూరగాయల మొక్కలు నాటాలని సిబ్బందిని సూచించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏఈ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తతో పూడిపోయిన మురికి కాలువ



ఆదర్శనగర్ వద్ద వ్యర్థాలతో పూడిపోయిన మురికి కాలువ

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ నగర్ వద్ద ఉన్న మురికి కాలువ చెత్తా చెదారంతో పూడిపోయింది. వ్యర్థాలన్నీ పేరుకుపోవడంతో మురుగు నీరు ముందుకు సాగడం లేదు. దీంతో దోమల ఉత్పత్తి పెరిగి స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. చాలా రోజులుగా కాలువల్లో అడ్డు పడిన చెత్తను తొలగించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శంఖవరంలో పొలం పిలుస్తోంది



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు, అధికారులు

కలసపాడు : మండలంలోని శంఖవరం, చింతల పల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఈ ఏడాది రబీ పంటలకు బీమా ప్రీమియం డిసెంబరు 15వ తేదీలోగా కామన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి 1బి, ఆధార్, బ్యాంకు పాసుపుస్తకం, పంట సాగు పత్రం తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ నవరత్న, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బ్రహ్మంగారిమఠం గురుకుల పాఠశాల విద్యార్థులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరి తెలిపారు. చక్రాయపేట మండలంలోని గండి గురుకుల కళాశాలలో బుధవారం జరిగిన జోనల్ లెవల్ హై జంప్, క్యారమ్స్‌లలో మొదటి స్థానం, ఖోఖోలో ద్వితీయ స్థానంలో గెలుపొందారని పేర్కొన్నారు. జోనల్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు ఏలూరు జిల్లా పెదవేగి గురుకుల పాఠశాలలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు.

నేడు సామూహిక రుద్రపూజ

కలసపాడు : తెల్లపాడు గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా సామూహిక రుద్రపూజ నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 6–30 గంటల నుంచి 8 గంటల వరకు, తెల్లపాడులో రాత్రి 6–30 గంటల నుండి 8 గంటల వరకు రుద్రపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సత్సంగం, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

29న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగు తుందని ప్రిన్సిపల్ శామ్యూల్ డేవిడ్ రాజు తెలిపారు. జాబ్ మేళాలో ప్రసిద్ధిగాంచిన కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. చదువుకున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 7013504977 నెంబరుకు ఫోన్ చేయాలని చెప్పారు.

రేపు రుద్రహోమం

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉదయం 6 గంటలకు రుద్రహోమం, సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తామని ఈఓ రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల అనుగ్రహాన్ని పొందాలని వారు కోరారు.


ఆడ పిల్లలను రక్షిద్దాం



రాజుపాళెం : మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణారెడ్డి

రాజుపాళెం : ఆడ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, వారిని రక్షించాలని ఎంపీడీఓ రమణారెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోరి వికాసం అనే కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఎలా మెలగాలో పిల్లలకు వివరిస్తూ తల్లిదండ్రులు పెంచాలని సూచించారు. ఎస్ఐ వెంకటరమణ, డాక్టర్ నిఖిల, వెలుగు ఏపీఎం సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయేశ్వరి మాట్లాడారు. ఆడ పిల్లలను రక్షించాలని అక్కడికి వచ్చిన వారంతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేలంగికుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ



పంపిణీ చేసిన దుస్తులతో ఆర్‌సీఎం పాఠశాల విద్యార్థులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని ఆర్‌సీఎం స్కూల్ విద్యార్థులకు బుధవారం చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకులు డా. గీత, తోమస్ రెడ్డి ప్రతి ఏటా క్రిస్మస్, నూతన సంవత్సరంను పురస్కరించుకుని ఆర్‌సీఎం పాఠశాలల్లోని విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తారని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమం చేపడతారని సంస్థ ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎస్.వేణుగోపాల ఆచారి

ప్రొద్దుటూరు కల్చరల్ : బ్రాహ్మణులు ఐకమత్యంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎస్.వేణుగోపాల ఆచారి పేర్కొన్నారు. బుధవారం కామనూరులో అఖిల భారత బ్రాహ్మణ ఉత్తరాక్రియ పుణ్యధామం నిర్మాణాన్ని పురస్కరించుకుని వన సమారాధన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజంలో ఇతర సామాజిక వర్గాల మాదిరిగా బ్రాహ్మణులు అభివృద్ధి సాధించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఐకమత్యంతో అన్ని వర్గాల ప్రజలతో కలిసిపోవాలని సూచించారు. ఉత్తరాక్రియ పుణ్యధామం నిర్మాణానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నిధులు కేటాయించాలని కోరారు. రాయలసీమలో ఎక్కడా పుణ్యధామానికి భవనం లేదని, ప్రొద్దుటూరులో మొదటి సారిగా భవన నిర్మాణం చేపట్టడం హర్షనీయమన్నారు. భవన నిర్మాణం పూర్తి కావడానికి ప్రభుత్వ నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరుతామన్నారు. ప్రభుత్వ పథకాలను బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ పుణ్యధామం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరగా కుందూ నది వద్ద రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం మంజూరు చేయించామని తెలిపారు. భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసి ఉపయోగంలోకి తేవాలని సూచించారు. ఈ సందర్భంగా దండపాణి శ్రీనివాసకుమార్ పుణ్యధామం నిర్మాణానికి రూ.5లక్షలు విరాళం ఇవ్వనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం బ్రాహ్మణులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శివరామానంద సరస్వతి స్వామి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, జగన్‌మోహన్ రాజు, అఖిల భారత బ్రాహ్మణ ఉత్తర క్రియ పుణ్యధామం సొసైటీ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్, ఉపాధ్యక్షుడు వెల్లాల కోదండ రామశాస్త్రి, కోశాధికారి వెల్లాల నరసింహ బాబ్జి, కంబగిరి రావు, కుమారస్వామి, అశ్వనీకుమార్, పుల్లయ్య శర్మ, సాయినాథ్ శర్మ పాల్గొన్నారు.

అనుమతులులేని నిర్మాణాలపై చర్యలు

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో కూడా బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ తీసుకోవడం తప్పనిసరి అని, ప్లాన్ అప్రూవల్ లేకుండా, అనుమతులు తీసుకోకుండా చేపట్టిన భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని హౌసింగ్ బోర్డులో గల ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఎంపీపీ శేఖర్ యాదవ్ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వరద మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం రోడ్ల మీదికి జరిపి నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ నిర్మాణాలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. వరి ధాన్యం ధరలు చాలా తక్కువగా ఉన్నాయని, రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా ధర నిర్ణయించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆయన కోరారు. గ్రామాల్లోని శ్మశానాలలో వసతుల కల్పనకు, ప్రహరీల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని, ప్రజా ప్రతినిధులు తమ పరిధిలోని శ్మశానాల వివరాలను తహసీల్దార్‌కు తెలిపాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించకుండా ఇసుకను తోలుకోవాలన్నారు. తమ సొంత గ్రామమైన దొరసానిపల్లె, రామాపురం గ్రామాల్లో వీధి లైట్లు పనిచేయడం లేదని, పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జెడ్పీ చైర్పర్సన్ జేష్ఠాది శారద సభలో ఫిర్యాదు చేశారు. ఎంజే ఆటో నగర్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఎంపీటీసీ పేరం సునీత సభ దృష్టికి తెచ్చారు. గోపవరం పంచాయతీలోని కేసీ కెనాల్ నుండి ఉప్పాగు వరకు గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ ఆసం దస్తగిరిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగయ్య, ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి, హౌసింగ్ డీఈ గురుప్రసాద్, ఎంఈఓ సావిత్రమ్మ, ఏఓ శివశంకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సంజీవ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : దువ్వూరు మండలం ముడిండ్లపల్లె గ్రామ సర్పంచ్ మంచాల రాజగోపాల్ రెడ్డి తండ్రి మంచాల సంజీవరెడ్డి గత శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మూడిండ్లపల్లెలోని సంజీవరెడ్డి స్వగృహానికి వెళ్లి సంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, గుడిపాడు సర్పంచ్ మాబు షరీఫ్, ఎంపీటీసీ గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, గోపిరెడ్డి గురివిరెడ్డి, మంచాల సుధాకర్‌రెడ్డి, వీవీ స్వామి, మంచాల ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టాలి



ఎర్రచందనం చెట్లను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ రాజశేఖర్‌బాబు

కాశినాయన : ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టాలని ప్రొద్దుటూరు డీఎఫ్ఓ రాజశేఖర్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని ఇటుగుల్లపాడు బీట్ పరిధిలోని రిజర్వు ఫారెస్టులో ఎర్రచందనం చెట్లు ఎక్కువగా ఉన్న ఏరియాను బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం రవాణాలో ఫారెస్టు అధికారుల ప్రమేయం ఉంటే ఉద్యోగం నుంచి తొలగించి జైలుకు పంపుతామన్నారు. ప్రతి ఉద్యోగి సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం బుగ్గ బేస్ క్యాంపు తనిఖీ చేసి ప్రొటెక్షన్ వాచర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల ఎఫ్ఆర్ఓ మదన్‌మోహన్‌రెడ్డి, సెక్షన్ అధికారి కాశిరెడ్డి, ఎఫ్‌బీఓ వెంకటేష్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అమృతానగర్ వాసి మృతి



మృతి చెందిన దస్తగిరి

ప్రొద్దుటూరు క్రైం : రూరల్ పరిధిలోని అమృతానగర్‌కు చెందిన దస్తగిరి (70) అనే వృద్ధుడు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న అతను సోమవారం రాత్రి జిల్లా ఆస్పత్రిలో చేరాడు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలిపేందుకు ప్రయత్నించగా.. అడ్మిషన్ సమయంలో అతను రాయించిన సెల్‌ఫోన్ నంబర్ పని చేయలేదని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. దీంతో మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు జిల్లా ఆస్పత్రిలోని పోలీస్ ఔట్‌పోస్టు కార్యాలయంలో సంప్రదించాలని ఇన్‌చార్జి అధికారి షబ్బీర్‌బాషా తెలిపారు.

జాతీయ సైన్స్ సాహిత్య సదస్సుకు ఎంపిక



డీవీ సుబ్బానాయుడు

మైదుకూరు : అస్సాంలోని గువాహటిలో ఈనెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు నిర్వహించే జాతీయ సైన్స్ సాహిత్య సదస్సుకు మైదుకూరుకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు, జిల్లా సైన్స్ సమన్వయకర్త డీవీ సుబ్బానాయుడు ఎంపికయ్యారు. సామాన్య ప్రజలకు శాస్త్రీయ విజ్ఞానాన్ని దగ్గరకు చేర్చే ఉద్దేశంతో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ అస్సాంలోని గువాహటి ఐఐటీలో ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. దేశ వ్యాప్తంగా సైన్స్ బోధించే అధ్యాపకులు, సైన్స్ రచయితలను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. రాష్ట్రం నుంచి ఇరువురికి స్థానం దక్కగా వారిలో మన జిల్లాకు చెందిన డీవీ సుబ్బానాయుడు ఒక్కరే ఎంపిక కావడం విశేషం. ప్రపంచంలో మేటి శాస్త్రవేత్తలు, నోబుల్ బహుమతి గ్రహీతలు, ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో విజ్ఞాన శాస్త్ర బోధనలో వస్తున్న నూతన పోకడలు, శాస్త్రీయ నైపుణ్యాలపై జరిగే చర్చా గోష్ఠిలో పాల్గొనే అవకాశం జిల్లా సైన్స్ సమన్వయకర్త సుబ్బానాయుడుకు దక్కింది.

నాఫెడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మైదుకూరు : మైదుకూరులో కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ ఏర్పాటు కోసం బుధవారం బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో నాఫెడ్, ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు బీజేపీ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కృషి విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనకు కేవీకే కార్యక్రమాలను శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి, ఫిరోజ్ హుస్సేన్, కాంతిశ్రీ వివరించారు.